రెండు నెలల క్రితం..



పచ్చదనం.. బంగారు వర్ణం

కమాన్‌పూర్ మండలం గుండారం రిజర్వాయర్ ఆయకట్టు వరి పొలాలు ఇవీ.. రెండు నెలల క్రితం పొగమంచు కప్పుకుని పచ్చదనం పరుచుకున్న వరిపైరు ఒక ఫొటోలో కనువిందు చేస్తుంటే.. మరో చిత్రంలో కోతకు వచ్చిన వరి పైరు బంగారు వర్ణం సంతరించుకుని స్థానికులను విశేషంగా ఆకట్టుకుంటోంది.
– కమాన్‌పూర్(మంథని)

ప్రస్తుతం..



న్యూస్‌రీల్

చట్టాలపై అందరికీ అవగాహన అవసరం



మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసరావు

గోదావరిఖనిటౌన్: చట్టాలపై అందరికీ అవగాహన అవసరమని జిల్లా అదనపు సెషన్స్ జడ్జి శ్రీనివాసరావు అన్నారు. స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాలలో శనివారం నిర్వహించిన న్యాయ విజ్ఞాన సదస్సులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వెంకట సచిన్‌రెడ్డితో కలిసి జడ్జి మాట్లాడారు. జీవితంలో ఒడిదుడుకులు సహజమని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని సూచించారు. విద్యార్థులు లక్ష్యం ఏర్పరుచుకొని సాధించాలని, వ్యసనాలకూ దూరంగా ఉండాలని కోరారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీశ్, న్యాయ సేవా మండలి బాధ్యులు శైలజ, జవ్వాజి శ్రీనివాస్, మిట్టపల్లి శంకర్, భూమయ్య, స్రవంతి, ప్రిన్సిపల్ రమాకాంత్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ వై.ప్రసాద్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మంత్రి ఉత్తమ్ రాక

పెద్దపల్లిరూరల్: రాష్ట్రమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదివారం జిల్లా కేంద్రంలో పర్యటిస్తారని సమాచారం. డిసెంబర్ 4వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా కేంద్రంలో పర్యటన నేపథ్యంలో ఏర్పాట్లను పరిశీలించేందుకు మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి వస్తున్నారని తెలిసింది. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆదివారం మధ్యాహ్నం 1.20 గంటలకు ప్రత్యేక హెలికాప్టర్‌లో ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పెద్దపల్లికి చేరుకుంటారు. కలెక్టరేట్‌లో ఇరిగేషన్, పౌర సరఫరాల శాఖల ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమీక్షించనున్నారు. అనంతరం పెద్ద కల్వలలోని సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొనున్న సభాస్థలి వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తారు. సాయంత్రం హైదరాబాద్‌కు వెళ్లిపోతారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



రాష్ట్ర పోటీలకు ఎంపికైన విద్యార్థులు

సుల్తానాబాద్‌రూరల్(పెద్దపల్లి): పెద్దపల్లిలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు అక్షయ్, అక్షిత, లక్ష్మీప్రసన్న, ఎస్.అక్షిత రాష్ట్రస్థాయి రైఫిల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయుడు, ఎంఈవో సురేంద్రకుమార్ శనివారం తెలిపారు. నవంబర్ 28న ఉమ్మడి కరీంనగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన పోటీల్లో వారు ప్రతిభ కనబర్చారన్నారు. డిసెంబర్ 2 నుంచి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారని ఆయన వివరించారు.


ప్రతిభ వెలికి తీసేందుకే..



ప్రదర్శనలు తిలకిస్తున్న ప్రవీణ్ కే చౌదరి

జ్యోతినగర్(రామగుండం): విద్యార్థుల్లోని సృజనాత్మకతను వెలికితీయడానికి విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు ఎంతగానో దోహదపడతాయని ఎన్టీపీసీ హెచ్‌ఆర్ డీజీఎం ప్రవీణ్ కే చౌదరి అన్నారు. స్థానిక సచ్‌దేవ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో శనివారం జరిగిన విజ్ఞాన ప్రదర్శనలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. తరగతి గదిలో విద్యతోపాటు అంతర్లీనంగా దాగి ఉన్న విజ్ఞానాన్ని వెలికి తీయడానికి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. అనంతరం విద్యార్థుల ప్రదర్శనలను ప్రిన్సిపాల్ జ్ఞాన్‌చంద్‌తో కలిసి తిలకించారు. ప్రతినిధులు వెంకటేశ్వర్లు, ఆదేశ్ కుమార్ పాండే, ఆరన్ జ్యోతి పాల్గొన్నారు.

హక్కులను పరిరక్షించాలి



ర్యాలీలో డీహెచ్‌ఎంవో అన్నప్రసన్న కుమారి

పెద్దపల్లిరూరల్: ఎయిడ్స్ బాధితుల హక్కులను పరిరక్షించడంతోపాటు ఇతరులకు వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి అన్నప్రసన్న కుమారి అన్నారు. రామగుండం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. ప్రిన్సిపాల్, అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితోపాటు కేవీ సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రక్త సంబంధాలను వదులుకోవద్దని..

హుజూరాబాద్: మండలంలోని కందుగుల గ్రామానికి చెందిన మొలుగూరి ఉదయశ్రీ తెలంగాణ గ్రామీణ నేపథ్యం ఉన్న కుటుంబాలను కథాంశంగా తీసుకొని, లఘు చిత్రాలు తీస్తోంది. అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లు ఆస్తుల కోసం గొడవ పడొద్దని, రక్త సంబంధాలను వదులుకోవద్దని చెబుతోంది. అలాగే, ఒక స్నేహితుడు ఎలా ఉండాలో తెలిపే అంశంపై రవీంద్ర భారతిలో షోస్ నిర్వహించినట్లు తెలిపింది. మన రాష్ట్రంతోపాటు ఆంధ్రప్రదేశ్‌లోని రాజమండ్రి, తెనాలిలలో కూడా ప్రదర్శన ఇచ్చామని పేర్కొంది. ఈ రోజుల్లో ఆడపిల్లలు ఎలా ఉండాలి.. ఎలా నడుచుకోవాలో చెబుతూ చాలా రీల్స్ చేసింది. దీంతో తక్కువ సమయంలోనే ప్రజాదరణ పొందింది. అన్నదమ్ముల అనుబంధం, బంగారి అత్త.. సింగారి కోడలు షార్ట్‌ఫిల్మ్‌లు తనకు పేరు తీసుకువచ్చాయని తెలిపింది.

చిన్న చిత్రం.. పెద్ద సందేశం

సండే స్పెషల్

- సమాజంలోని పలు అంశాల ఆధారంగా షార్ట్‌ఫిల్మ్‌ల నిర్మాణం
- రీల్స్ కూడా చేస్తున్న పలువురు ఉమ్మడి జిల్లావాసులు


ప్రస్తుత, సమకాలీన అంశాల ఆధారంగా రూపొందుతున్న లఘుచిత్రాలకు ఆదరణ లభిస్తోంది. వీటి ద్వారా చాలామంది యువతీ యువకులు మంచి సందేశం ఇస్తున్నారు. మానవ విలువలు, కుటుంబ సంబంధాలు, అమ్మానాన్న, తోబుట్టువుల ప్రాధాన్యం, సామాజిక సమస్యలు, ఆన్‌లైన్ మోసాలు, ఆస్తుల గొడవలు తదితరాలపై ఆకట్టుకునేలా షార్ట్‌ఫిల్మ్‌లు తీస్తున్నారు. వీటిల్లోని మంచి మాటలను రీల్స్ రూపంలోనూ సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేస్తున్నారు. ఇవి ఎంతోమందిని ప్రభావితం చేస్తున్నాయి. అలాంటివారిపై సండే స్పెషల్..



బంగారి అత్త.. సింగారి కోడలు షార్ట్‌ఫిల్మ్ పోస్టర్



అమ్మ బలగం లఘుచిత్ర పోస్టర్



ఆధార్ స్కామ్ రీల్‌లో వినయ్



చదువు ప్రాముఖ్యతపై..

శంకరపట్నం(మానకొండూర్): శంకరపట్నం మండలంలోని కరీంపేటకు చెందిన రాసమల్ల శ్రీనివాస్ ఎంఏ పొలిటికల్ సైన్స్ చదివాడు. తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. 2011 నుంచి 2018 వరకు సాక్షర భారత్ మండల కో–ఆర్డినేటర్‌గా పని చేశాడు. యువత మద్యపానం, ధూమపానం, మత్తు పదార్థాలకు బానిసలై, జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని, చదువు ప్రాముఖ్యతను వివరిస్తూ తీసిన అమ్మ కష్టం.. కొడుకు సుఖం అనే లఘుచిత్రంలో నటించాడు. దీంతోపాటు అమ్మ బలగం షార్ట్ ఫిల్మ్ తనకు ఎంతో గుర్తింపు తీసుకువచ్చిందని తెలిపాడు. ఇలాంటి సందేశాత్మక షార్ట్‌ఫిల్మ్‌లలో నటిస్తూ యూట్యూబ్, ఫేస్‌బుక్‌లలో పోస్టు చేసి, యువతలో ప్రేరణ కలిగిస్తుండటం తృప్తినిస్తోందని అంటున్నాడు.

టెక్నాలజీ మార్పులపై..

ముత్తారం(మంథని): ముత్తారం మండలంలోని కేశనపల్లికి చెందిన యెన్‌రెడ్డి వినయ్ బీటెక్ చదివాడు. టెక్నాలజీలో వస్తున్న మార్పులపై యూట్యూబ్, ఇన్‌స్టాగామ్‌లో చిన్న చిన్న వీడియోలు పెడుతున్నాడు. ఈ రెండింటిలో కలిపి ఇతనికి దాదాపు 8 లక్షల మంది సబ్‌స్క్రైబర్లు ఉన్నారు. ఉద్యోగాలు, ఆధార్ నంబర్, సిమ్, అమెజాన్, వాట్సాప్ పేరిట జరుగుతున్న మోసాల నుంచి నుంచి ఎలా తప్పించుకోవాలి, ఫోన్ పోతే, ఇన్‌స్టాగామ్ హ్యాక్ అయితే ఏం చేయాలనే అంశాలపై వీడియోలు చేశాడు. ఫోర్బ్స్ ఇండియా జాబితాలో టాప్ 100 డిజిటల్ స్టార్స్ దక్కిన ఒకే ఒక్క తెలుగు వ్యక్తిని తానేనని తెలిపాడు. పలువురు వ్యాపారవేత్తల నుంచి ప్రశంసలు అందుకోవడం ఆనందంగా ఉందన్నాడు.

ఆత్మహత్యలపై రీల్స్..



ఆత్మహత్యలపై రీల్‌లో ప్రవీణ్

వేములవాడ: పట్టణంలోని శాస్త్రీనగర్‌కు చెందిన మారం ప్రవీణ్ జానపద కళాకారుడు. సామాజిక స్పృహ కలిగించే అంశాలతో రీల్స్ చేస్తూ పేరు తెచ్చుకున్నాడు. మహాశివరాత్రి రోజు పరమశివుని వేషధారణలో ఆకట్టుకుంటున్నాడు. వరకట్నం కోరలకు కూతురు బలైన వీడియో సాంగ్‌లో ప్రవీణ్‌తోపాటు నటి నాగలక్ష్మి నటించారు. ఉడుకు అన్నం తినేటప్పుడు ఊదుకుంటూ తింటావు కొడుకా.. కిరోసిన్ పోసుకొని ఎట్లా సచ్చిపోతున్నవంటూ యువత ఆత్మహత్యలపై తల్లి కడుపుకోతను వివరించిన రీల్స్ ప్రాచుర్యం పొందాయి. నాటుసారా తాగి, సంసారం అంగడైన వైనాన్ని పాట రూపంలో ప్రవీణ్, భార్యగా నటి రమ్యశ్రీ చక్కగా వివరించారు.

సన్మార్గంలో నడవాలని..



మనిషి పశువైతే లఘు చిత్రం టైటిల్

విద్యానగర్(కరీంనగర్): మోడ్రన్ యాక్టింగ్ స్కూల్ ఆఫ్ కరీంనగర్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న ఔత్సాహికులతో మాస్క్ ప్రొడక్షన్ బ్యానర్‌పై లఘు చిత్రాలు నిర్మిస్తున్నారు. ఆడపిల్లలపై జరుగుతున్న దాడులు, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ కథాంశాలతో మనిషి పశువైతే అనే షార్ట్‌ఫిల్మ్ తీశారు. చేంజ్, హెచ్‌సీఎల్, అచ్చిండు, లిటిల్ రాస్కెల్, ఈజీ మనీ, ఆల్‌వేస్ బీ కేర్‌ఫుల్, కసి, సారాపై సమరం వంటివి నిర్మించారు. చెడు దారుల్లో వెళ్తున్న యువత మంచి మార్గంలో నడవాలన్న కథాంశాలతో 20కి పైగా లఘుచిత్రాలను నిర్మించినట్లు ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకుడు అనసూరి భూనాథచారి తెలిపాడు.

హెల్మెట్ ప్రాధాన్యంపై..



హెల్మెట్ షార్ట్‌ఫిల్మ్‌లో ఓ దృశ్యం

సిరిసిల్ల: సిరిసిల్లకు చెందిన ములుక శ్రీకాంత్ నిర్మించిన బైక్‌పై వెళ్లేటప్పుడు హెల్మెట్ ధరించాలంటూ హెల్మెట్ పేరిట నిర్మించిన షార్ట్‌ఫిల్మ్ అందరినీ ఆలోచింపజేసింది. 5 నిముషాల నిడివి గల ఈ వీడియోకు యూట్యూబ్‌లో 14 లక్షల వ్యూస్ వచ్చాయి. ఈ లఘుచిత్రానికి సిరిసిల్ల మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్ ఆర్థికసాయం అందించగా.. అప్పటి టౌన్ సీఐ విజయ్‌కుమార్ ముగింపు వ్యాఖ్యలు చెప్పారు. కుభేరులు, ఓటరు, లాల్చీ గుండూబాయ్, స్వచ్ఛ సిరిసిల్ల వంటి షార్ట్‌ఫిల్మ్‌లు తనకు పేరు తీసుకువచ్చాయని శ్రీకాంత్ తెలిపాడు. ఫొటోగ్రాఫర్‌గా ఉన్న అనుభవంతో లఘుచిత్రాలు తీస్తున్నానని, స్థానికంగా పలువురు అభినందిస్తుండటం ఆనందంగా ఉందని అంటున్నాడు.

సామాజిక సమస్యలపై..

ఇల్లంతకుంట(మానకొండూర్): పలు సామాజిక సమస్యలపై లఘు చిత్రాలు నిర్మిస్తున్నాడు ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరికి చెందిన తిప్పరవేణి బాలకిషన్. చిన్నతనంలోనే ఎల్లమ్మ నాటకం, చిరుతల రామాయణంలలో పాత్రలు వేసినట్లు తెలిపాడు. గ్రామంలో ఫొటోగ్రాఫర్‌గా పనిచేస్తూ సినిమాలపై ఆసక్తి పెంచుకొని, శ్రీకృష్ణదేవరాయ, బాస్, స్టూడెంట్ నంబర్ వన్, తొలి పరిచయం తదితర సినిమాలకు అసిస్టెంట్ కెమెరామెన్‌గా పని చేసినట్లు పేర్కొన్నాడు. తొమ్మిదేళ్లుగా అక్షర ఆర్ట్ క్రియేషన్స్ పేరిట లఘుచిత్రాలు నిర్మిస్తున్నట్లు చెప్పాడు. రసాయనిక ఎరువులతో నష్టాన్ని, సేంద్రియ ఎరువుల వినియోగంతో ఉపయోగాలను వివరిస్తూ ఎవుసం అనే షార్ట్ ఫిల్మ్ తీసి, యూట్యూబ్‌లో పోస్టు చేశాడు. బాటసారి, ఈ బ్రతుకు వంటి లఘు చిత్రాలు తీశాడు.



ఈ బ్రతుకు షార్ట్ ఫిల్మ్ పోస్టర్

సీఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

- కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లిరూరల్: జిల్లాలో డిసెంబర్ 4న సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. అదనపు కలెక్టర్‌లు వేణు, అరుణశ్రీతో కలిసి సీఎం పర్యటన ఏర్పాట్లపై అధికారులతో శనివారం సమీక్షించారు. సుమారు 9,500 మంది అభ్యర్థులకు సీఎం ఉద్యోగ నియామక పత్రాలు పంపిణీ చేస్తారని, సింగరేణిలో నియమించిన అభ్యర్థులకూ నియామక పత్రాలు పంపిణీ చేయాలని సూచించారు. కలెక్టరేట్ హెలిప్యాడ్ నుంచి బహిరంగ సభ స్థలానికి చేరుకునేందుకు ప్రొటోకాల్ ప్రకారం సీఎం కాన్వాయ్ సిద్ధం చేయాలని ఆదేశించారు. రోడ్లు, భవనాల శాఖ ద్వారా రూ.266 కోట్లు, పంచాయతీరాజ్ ద్వారా రూ.66 కోట్లతో చేపట్టే రోడ్డు పనులు, రూ.10కోట్లతో వెహికల్ సబ్ స్టేషన్ పనులు, రూ.26 కోట్లతో నర్సింగ్ కళాశాల, రూ.10 కోట్లతో శాతవాహన కళాశాల అకడమిక్ బ్లాక్ పనుల సీఎం శంకుస్థాపన, ప్రారంభోత్సవం చేస్తారని కలెక్టర్ వివరించారు. ఇందుకు అవసరమైన శిలాఫలకాలు తయారు చేయాలని ఆయన సూచించారు.

సీఎం టూర్ షెడ్యూల్ ఇది..

సీఎం వేదికపైకి చేరుకొని జ్యోతి ప్రజ్వలన, రాష్ట్ర గేయం, ముఖ్య కార్యదర్శి, మంత్రుల సందేశం అనంతరం ఎంపిక చేసిన 10 మంది అభ్యర్థులకు నియామకపు పత్రాల పంపిణీ చేస్తారని కలెక్టర్ తెలిపారు. స్కిల్ యూనివర్సిటీతో 7 ఏజెన్సీల ఎంవోయూ, డీఈఈటీ లాంచ్, సీఎం కప్ ఆవిష్కరణ ఉంటాయన్నారు. డిప్యూటీ సీఎం, సీఎం సందేశాలతో కార్యక్రమం ముగుస్తుందని తెలిపారు. వేదికపై వీవీఐపీలు, వీఐపీలు ఇతర నాయకులు, ఉన్నతాధికారుల జాబితా ముందుగానే తయారు చేసి పోలీస్ శాఖకు అందజేయాలని కలెక్టర్ తెలిపారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

సభాప్రాంగణం వద్ద బారికేడ్లు..

సభా ప్రాంగణం వద్ద బారికేడ్లు ఏర్పాటు చేయాలని, రుణమాఫీ, బోనస్ పొందిన రైతులు, మహిళా సంఘాల సభ్యులు సీఎం సభకు తరలివచ్చేలా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ శ్రీహర్ష అన్నారు. సిబ్బందికి గుర్తింపు కార్డులు అందజేయాలని సూచించారు. ప్రజలు, అభ్యర్థులు, రైతులు, వివిధ వర్గాలకు తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు సిద్ధం చేయాలని సూచించారు. వాహనాల కోసం ప్రత్యేకంగా పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కలెక్టర్ ఆదేశించారు.

కార్మిక క్షేత్రం అభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

యైటింక్లయిన్‌కాలనీ(రామగుండం): సింగరేణి కార్మికక్షేత్రం అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తున్నానని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. స్థానిక భవాని గార్డెన్స్‌లో శనివారం రాత్రి ఏర్పాటు చేసిన ఆర్జీ–2 ఏరియా ఐఎన్‌టీయూసీ జనరల్‌బాడీ సమావేశంలో రాష్ట్ర కనీస వేతన సలహా మండలి చైర్మన్ జనక్‌ప్రసాద్‌తో కలిసి ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత కార్మికుల పెండింగ్ సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. డిపెండెంట్ల వయోపరిమితిని 35 నుంచి 40ఏళ్ల పెంచామని, రామగుండంలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి, 800 మెగావాట్ల పవర్ ప్లాంట్, స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నామని మక్కాన్‌సింగ్ తెలిపారు. స్థానికులకే 80శాతం ఉద్యోగాలు వంటి అనేక హక్కులను సాధించుకున్నామని తెలిపారు. నాయకులు కొత్త సత్యనారాయణరెడ్డి, నరసింహారెడ్డి, ధర్మపురి, వంగ లక్ష్మీపతి, అక్రమ్, వికాస్‌కుమార్‌యాదవ్, వడ్డేపల్లి దాస్, అక్బర్‌అలీ, సదానందం తదితరులు పాల్గొన్నారు.

స్థానికత ఎక్కడ..?

- 317 జీవోలో బదిలీ అయిన వారికి ట్రాన్స్‌ఫర్ అవకాశం
- స్పౌజ్, అనారోగ్యం, మ్యూచువల్ బదిలీలకు పచ్చజెండా
- స్థానికత నిర్ధరణపై కానరాని స్పష్టత
- టీచర్లు, ప్రభుత్వ ఉద్యోగుల్లో ఆందోళన

సాక్షి ప్రతినిధి, కరీంనగర్: జీవో 317 అమలు కారణంగా అయిష్టంగా బదిలీ అయిన ఉద్యోగులకు ప్రభుత్వం తీపి కబురు చెప్పింది. 2022 జనవరిలో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఆధారంగా ఉద్యోగుల విభజన చేపట్టింది. ఇందులో నిబంధనలు పాటించలేదని, శాస్త్రీయత లోపించిందని, స్థానికత నిర్ధారణను పరిగణనలోకి తీసుకోలేదని ఉద్యోగులు తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. బీజేపీ, అప్పటి ప్రతిపక్ష పార్టీలన్నీ రోడ్లపైకి వచ్చి ఉద్యోగులకు మద్దతుగా ఆందోళనలు చేపట్టాయి. అప్పటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ప్రస్తుత కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ చేపట్టిన దీక్ష తీవ్ర హింసాత్మకంగా మారి, జాతీయస్థాయిలో సంచలనంగా మారిన సంగతి తెలిసిందే. అయినా ప్రభుత్వం తన పని తాను చేసుకుపోయింది. దీంతో ప్రభుత్వ టీచర్లు, ఉద్యోగులలో చాలామంది అయిష్టంగానే వారికి కేటాయించిన జిల్లాలకు వెళ్లి విధుల్లో చేరారు.


ప్రస్తుత జీవోలో ఏముంది..?

317 జీవో అమలులో కొందరు ఫోకల్ (ఉమ్మడి జిల్లాకేంద్రం) జిల్లా నుంచి మారుమూల ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చింది. ఆ సమయంలో కొన్ని స్పౌజ్ కేసులకు మాత్రం మినహాయింపు ఇచ్చారు. తాజాగా ప్రభుత్వం స్పౌజ్, అనారోగ్యం, మ్యూచువల్ కేసుల బదిలీలు చేపట్టేందుకు అనుకూలంగా జీవోలు విడుదల చేసింది. ఇందులో జీవో 245 పరస్పర బదిలీలు (మ్యూచువల్ ట్రాన్స్‌ఫర్), జీవో 244 మెడికల్ బ్యాక్‌గ్రౌండ్ (అనారోగ్య సమస్యలు), జీవో 243 స్పౌజ్ దంపతులైన ప్రభుత్వ ఉద్యోగులు బదిలీల కోసం మార్గదర్శకాలు విడుదల చేసింది. దీనిని ప్రభుత్వ టీచర్లతోపాటు, పోలీసు, రెవెన్యూ, ఇతర అన్ని శాఖల ఉద్యోగులు స్వాగతిస్తున్నారు.

కనిపించని స్థానికత నిర్ధరణ

తాజాగా విడుదల చేసిన మూడు జీవోలు, మార్గదర్శకాలపై సర్వత్రా హర్షం వ్యక్తమవుతోంది. అదే సమయంలో స్థానికత నిర్ధరణపై మాత్రం స్పష్టత ఇవ్వలేదు. దీనిపై అన్ని విభాగాల ప్రభుత్వ ఉద్యోగులు సర్కారును నిలదీస్తున్నారు. పైన తెలిపిన అంశాలతోపాటు స్థానికత నిర్ధరణ కూడా అవసరమేనని, అలాంటి ముఖ్యమైన స్థానికతను విస్మరించడమేంటని పెదవి విరుస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో కరీంనగర్ 8,469, జగిత్యాల 7,880, పెద్దపల్లి 5,108, సిరిసిల్ల 4,011 కలిపి దాదాపు 24వేల మందికిపైగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగుల స్థానికత నిర్ధరణపైనే వారి భవితవ్యం ఆధారపడి ఉందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు స్థానికత నిర్ధరణ చేపట్టి, స్థానికత కోల్పోయిన ఉద్యోగులను వారి స్థానికత ఆధారంగా పోస్టింగ్‌లు కల్పించాలని ఎస్టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రవి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. స్థానికత కోల్పోయిన ఉద్యోగులకు తాజాగా స్థానికత జీవో విడుదల చేసి వారికి న్యాయం చేయాలని బీసీ ఉద్యోగుల సంఘం ఉమ్మడి కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు మర్రి శ్రీనివాస్‌యాదవ్ కోరారు.

బాధితులకు భరోసా కల్పించండి



పోలీస్ కానిస్టేబుళ్లకు సూచనలు చేస్తున్న రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్

గోదావరిఖని: ఆపదలో ఆదుకోవాలనే ఉద్దేశంతో ఠాణాకు వచ్చే బాధితులకు తామున్నామంటూ భరోసా కల్పించాలని రామగుండం పోలీస్ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. పోలీసు కానిస్టేబుళ్లుగా ఎంపికైన వారిలో 392 మందికి శనివారం సీపీ నియామకపత్రాలు అందజేసి మాట్లాడారు. విధి నిర్వహణలో అంకితభావం, నీతి, నిజాయతీతో పనిచేయాలన్నారు. సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కోవాలని కోరారు. మొత్తం 392 మంది కానిస్టేబుళ్లు ఎంపికైతే.. అందులో 236 మంది సివిల్ కానిస్టేబుళ్లు ఉన్నారని, ఇందులో 83 మంది మహిళా కానిస్టేబుళ్లు ఉన్నారని పేర్కొన్నారు. మరో 156 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు, వీరిలో 37 మహిళా ఏఆర్ కానిస్టేబుళ్లు ఉన్నారని తెలపారు. అడిషనల్ డీసీపీ(అడ్మిన్), రాజు, స్పెషల్ బ్రాంచ్, ఏఆర్ ఏసీపీలు రాఘవేంద్రరావు, సుందర్‌రావు, ఏవో అశోక్‌కుమార్ ఉన్నారు.

కార్మికులకు ఒరిగిందేమీ లేదు

- స్ట్రక్చరల్ సమావేశంతో నిష్ప్రయోజనం
- టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి



మాట్లాడుతున్న మిర్యాల రాజిరెడ్డి

గోదావరిఖని: స్ట్రక్చరల్ సమావేశంతో సింగరేణి కార్మికులకు ఒరిగిందేమి లేదని టీబీజీకేఎస్ అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక ప్రధాన చౌరస్తా సమీపంలోని టీబీజీకేఎస్ కేంద్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈనెల 28న కొత్తగూడెంలో జరిగిన స్ట్రక్చరల్ మీటింగ్ సమావేశంలో గుర్తింపు కార్మిక సంఘం ఏఐటీయూసీ 11అంశాలపై చర్చిస్తే కనీసం ఒక్క అంశంపై కూడా స్పష్టత రాలేదన్నారు. డిసెంబర్ 2022న జరిగిన సమ్మెలో మారు పేర్ల సమస్యపై అవగాహన జరిగినా అమలు చేయించకపోవడం అన్యాయమన్నారు. గతంలో నెలకు రెండు, మూడు మెడికల్ బోర్డులు జరిగేవని, ప్రస్తుతం ఒకటికూడా జరడం లేదన్నారు. కార్మికులకు సొంతింటి కోసం 250 గజాల స్థలం, ఇంటి నిర్మాణంకోసం రూ.20 లక్షలు వడ్డీలేని రుణం, పెర్క్స్‌పై ఇన్‌కంట్యాక్స్ హామీ ఇచ్చినా చర్చల్లో ఎలాంటి పురోగతి లేదని అన్నారు. 35 నుంచి 40ఏళ్ల నిబంధన పెంచినా పదోతరగతి పాసైన వారికే నేరుగా ఇస్తామని, మిగతా వారిని విజిలెన్స్‌కు పంపిస్తామనడం ఏమిటని నిలదీశారు. నాయకులు వడ్డేపల్లి శంకర్, మాదాసు రాంమూర్తి, నూనె కొమురయ్య, పర్లపల్లి రవి, సతీశ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

క్లుప్తంగా

17శాతం తేమ రాగానే ధాన్యం కొనుగోలు చేయాలి

పెద్దపల్లిరూరల్: ధాన్యంలో 17తేమ శాతం రాగానే కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ వేణు ఆదేశించారు. వివిధ గ్రామాల్లో శనివారం ఆయన విస్తృతంగా పర్యటించారు. పెద్దబొంకూర్, కొత్తపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం నాణ్యత తనిఖీ చేశారు. కొనుగోలు చేసిన వెంటనే ధాన్యాన్ని రైస్ మిల్లులకు తరలించాలని సూచించారు. 100శాతం కొనుగోలు చేసిన ధాన్యం వివరాలను ట్యాబ్ ఎంట్రీ పూర్తి చేయాలని అన్నారు. రైస్ మిల్లుల వద్ద కోతలు లేకుండా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు.

'సీఎం ఓవర్‌సీస్'కు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లిరూరల్: తెలంగాణ మైనారిటీ సంక్షేమ శా ఖ డైరెక్టర్, కమిషనర్ ఆదేశాల మేరకు ముఖ్యమంత్రి ఓవర్ సీస్ పథకం కింద స్కాలర్‌షిప్/ఆర్థిక సా యం పొందేందుకు అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి జె.రంగారెడ్డి శనివారం సూచించారు. ఇంజినీరింగ్‌లో 60శాతం, పీజీలో 60శాతం మార్కులు సా ధించి విదేశాల్లో డాక్టరేట్ చదువుకునేందుకు ఆసక్తిగలవారు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలన్నారు. ద రఖాస్తుదారు కుటుంబ సంవత్సరాదాయం రూ.5 లక్షల లోపు ఉండాలని, అమెరికా, యూకే, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, ఫ్రాన్స్, జర్మనీ, జపాన్, న్యూజిలాండ్, దక్షిణ కొరియాల్లోని యూనివర్సిటీ ల్లో ప్రవేశాలు పొందిఉన్న వారు అర్హులన్నారు. వివరాలకు www.telangana epass.cgg.gov.in వెబ్‌సైట్‌లో సంప్రదించాలని ఆయన సూచించారు.

'కేసులు మాకు కొత్తేమీ కాదు'



మాట్లాడుతున్న పుట్ట మధూకర్

ముత్తారం(మంథని): ప్రజాసమస్యలపై ప్రశ్నిస్తే కేసులు నమోదు చేస్తున్నారని, ఇవేమీ తమకు కొత్తేమీకాదని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధుకర్ అన్నారు. స్థానిక ముత్తారం–అడవిశ్రీరాంపూర్ చౌరస్తాలో శనివారం 'కాంగ్రెస్ ప్రజావంచన దినం' నిర్వహించారు. ఈ సందర్భంగా పుట్ట మధు, బీఆర్ఎస్ శ్రేణులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. మధూకర్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల పేరిట ప్రజలను మోసం చేసి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. ఇప్పుడు ఏం అభివృద్ధి చేసి విజయోత్సవాలు జరుపుకుంటోందని నిలదీశారు. హైడ్రా పేరిట ఇళ్లు కూల్చుతున్నారని, ఐదు లక్షల విద్య భరోసా కార్డులు లేవని, మండలానికో ఇంటర్నేషనల్ స్కూల్ ఏమైందని ప్రశ్నించారు. ఈనెల 4న సీఎం రేవంత్‌రెడ్డి పెద్దపల్లికి వచ్చి తన ఏడాది పాలనలో ఏం ఒరగబెట్టారో వెల్లడించాలని డిమాండ్‌చేశారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్యపటేల్, అత్తె చంద్రమౌళి, నాయకులు నూనె కుమార్, ఇల్లాందుల అశోక్, పోతిపెద్ది రమణరెడ్డి, భూపెల్లి మొగిలి, గాదం శ్రీను, రాజిరెడ్డి, చల్ల సమ్మయ్య, సుదాడి రవీందర్‌రావు, దుబాసీ శ్రీనివాస్, బాలమల్లు తదితరులు ఉన్నారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి



సుల్తానాబాద్‌రూరల్: ఎలిగేడు మండలం బురహాన్‌మియాపేటకు చెందిన గౌరు నిరంజన్‌కుమార్(37) వీఆర్ఏగా పని చేస్తున్నాడు. శుక్రవారం బైక్‌పై సుల్తానాబాద్ మండలం గట్టెపల్లిలోని అత్తగారింటికి వచ్చాడు. రాత్రి స్వగ్రామం వెళ్తుండగా గట్టెపల్లి అండర్ రైల్వే బ్రిడ్జి వద్ద వాహనం అదుపుతప్పడంతో కిందపడ్డాడు. ఈ ఘటనలో అతని తలకు తీవ్ర గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడి భార్య సంధ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు.

ఆవిష్కరణలు అదరహో..

- అట్టహాసంగా ప్రారంభమైన బాల వైజ్ఞానిక, ఇన్‌స్పైర్ మనాక్ పోటీలు
- ఎగ్జిబిట్స్‌తో అబ్బురపరిచిన విద్యార్థులు

సప్తగిరికాలనీ(కరీంనగర్): కరీంనగర్ కొత్తపల్లిలోని సెయింట్ జార్జ్ పాఠశాలలో 52వ జిల్లా స్థాయి బాల వైజ్ఞానిక ప్రదర్శన 2024–25, జిల్లాస్థాయి ఇన్‌స్పైర్ మనాక్ 2023–24 ప్రదర్శన పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ప్రదర్శించిన రైల్వే గేట్ వద్ద ప్రమాదాలను ఎలా అరికట్టవచ్చు, వాహనాలు నడిపేటప్పుడు నిద్రొస్తే అలర్ట్ చేసే అలారం, మనిషిలోని శరీర భాగాలు ఏ విధంగా పని చేస్తాయి.. వంటి ఎగ్జిబిట్స్ అబ్బురపరిచాయి. అత్యుత్తమ ప్రాజెక్టులను రాష్ట్రస్థాయి సైన్స్‌ఫేర్‌కు ఎంపిక చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు తమ ప్రదర్శనల వివరాలు 'సాక్షి'కి వెల్లడించారు.

హైడ్రాలిక్ బ్రిడ్జి



✍ ఎన్.రక్షిత

పాఠశాల : మానేర్ సీబీఎస్ఈ స్కూల్, కరీంనగర్

తరగతి: 9వ., **గైడ్ టీచర్ :** షేక్ జహారా

వాడిన పరికరాలు : కార్డ్ బోర్డ్, సిరంజీలు, గ్లూకోజ్ పైప్స్, వాటర్ ట్రే, బోట్, త్రెడ్స్, పెయింటింగ్ తదితర వస్తువులు.

ఉపయోగం : ఓపెన్ బ్రిడ్జి. సులువుగా వాహనదారులు ఉపయోగించవచ్చు. నీటిలో స్టీమర్స్, బోట్లు వెళ్లినప్పుడు బ్రిడ్జి రెండు భాగాలుగా విడిపోతుంది.

సోలార్ పెస్టిసైడ్ పవర్ స్ప్రేయర్



✍ కె.అభిషేక్

పాఠశాల : జెడ్పీహెచ్ఎస్, గన్నేరువరం

తరగతి: 10వ., **గైడ్ టీచర్ :** నరేందర్

వాడిన పరికరాలు : 170 వాట్స్ ప్యానల్ సోలార్, యూపీఎస్, కూలర్‌పంప్ మోటార్, టిన్, స్టాండ్ తదితర వస్తువులు.

ఉపయోగం : కరెంట్ అందుబాటులో లేని సమయంలో సోలార్‌తో పంట పొలాల్లో పురుగుల మందు చల్లుకోవచ్చు.

ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలి

- కలెక్టర్ పమేలా సత్పతి

విద్యార్థులు ప్రశ్నించేతత్వం అలవర్చుకోవాలని కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. జిల్లా వైజ్ఞానిక ప్రదర్శనను ఆమె ప్రారంభించి, మాట్లాడారు. సరైన సమాధానం చెప్పిన విద్యార్థులను మెచ్చుకోవడంతోపాటు చెప్పనివారిని ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని అన్నారు. అలా ప్రోత్సహించాలని టీచర్లకు సూచించారు. అప్పుడే వారిలో కొత్త ఆలోచనలు వచ్చి, ఆవిష్కరణలకు రూపకల్పన చేస్తారని తెలిపారు. ఎమ్మెల్సీ కూర రఘోత్తమ రెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు శాస్త్రీయ దృక్పథాన్ని అలవర్చుకొని, నూతన ఆవిష్కరణలపై దృష్టిసారించాలని సూచించారు. అదనపు కలెక్టర్ ప్రఫుల్ దేశాయ్, డీఈవో జనార్దన్‌రావు, జిల్లా సైన్స్ అధికారి చాడ జయపాల్ రెడ్డి, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్ర రాజు, సెయింట్ జార్జ్ పాఠశాల చైర్మన్ ఫాతిమారెడ్డి, డీసీఈబీ కార్యదర్శి మారం స్వదేశీకుమార్, ఎస్సారార్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ పమేలా సత్పతి, పక్కన అడిషనల్ కలెక్టర్, డీఈవో

ఉమెన్ సేఫ్టీ బ్యాగ్

✍ డి.ప్రియదర్శిని



పాఠశాల : జెడ్పీ హెచ్ఎస్, రాగంపేట

తరగతి : 9వ.

గైడ్ టీచర్ : సీహెచ్.శ్రీనివాస్

వాడిన పరికరాలు : 9 వాట్స్ బ్యాటరీ, స్టేయిర్‌కేస్, రెసిస్టెన్స్, ఐసీ, మానిటర్, వాయిస్ ఓవర్, రికార్డర్, స్టంప్ తదితర వస్తువులు.

ఉపయోగం : ఆడవాళ్లు బయటకు వెళ్లినప్పుడు అనుకోని ప్రమాదం జరిగితే ఈ బ్యాగ్‌కు ఉన్న బటన్ నొక్కగానే హెల్ప్ మీ ప్లీజ్ అనే వాయిస్ ఓవర్ వస్తుంది.

ఆటోమేటిక్ రైల్వే గేట్

✍ శ్రావిక



పాఠశాల : అల్ఫోర్స్ ఈ–టెక్నో స్కూల్, కరీంనగర్

తరగతి : 9వ.

గైడ్ టీచర్ : రమేశ్

వాడిన పరికరాలు : సర్వో మోటార్, మదర్‌బోర్డు, బజర్, ఐఆర్ సెన్సార్, ట్రాఫిక్ లైట్స్, వాయిస్ ఓవర్ తదితరాలు.

ఉపయోగం : రైల్వే ప్రమాదాలను నివారించవచ్చు. ఆటోమేటిక్‌గా రైల్వే గేట్‌కు 6 కిలోమీటర్లు, 1 కిలోమీటర్ దూరంలో ఉన్నప్పుడు వాయిస్ వస్తుంది.

రెయిన్ అలర్ట్ అలారం

✍ ఎం.అనూష



పాఠశాల : జెడ్పీహెచ్ఎస్, వేగురుపల్లి

తరగతి : 6వ., **గైడ్ టీచర్ :** శ్రీనివాస్

వాడిన పరికరాలు : కాట్ బోర్డు, వైరు, చాట్స్, బ్యాటరీ, స్విచ్, అలారం తదితర వస్తువులు.

ఉపయోగం : వాతావరణ శాఖ రైతులను అలర్ట్ చేయడానికి, వర్షపు నీటిని నిల్వ చేసుకోవడానికి ఉపయోగపడుతుంది.

యాంటీ స్లీప్ అలారం

✍ ఎం.భరద్వాజ్



పాఠశాల : సిద్దార్థ స్కూల్, కరీంనగర్

తరగతి : 8వ

గైడ్ టీచర్ : రాజేందర్

వాడిన పరికరాలు : గ్లాసెస్, బ్యాటరీ, సెన్సార్, వైర్ తదితర వస్తువులు

ఉపయోగం : వాహనాలు నడిపేటప్పుడు నిద్ర వస్తే ఆటోమేటిక్‌గా అల్లారం మోగుతుంది. వెంటనే ప్రమాదం నుంచి తప్పించుకోవచ్చు.

జియో థర్మల్ ఎనర్జీ

✍ ఎస్.శరణ్య



పాఠశాల : తెలంగాణ మోడల్ స్కూల్, రుక్మాపూర్

తరగతి : 10వ.

గైడ్ టీచర్ : రాధ

వాడిన పరికరాలు : మోటార్ బాక్సస్, ఫ్యాన్, స్టీమ్ హీటర్, గ్లూకాగాన్, వైర్, స్విచ్ బోర్డు, కూలింగ్ పవర్ తదితర వస్తువులు.

ఉపయోగం : భూమి నుంచి వచ్చే ఉష్ణాన్ని వినియోగించుకోవచ్చు.

హైడ్రాలిక్ లిఫ్ట్

✍ సహోక్ష



పాఠశాల : జీహెచ్ఎస్ సప్తగిరికాలనీ, కరీంనగర్

తరగతి : 9వ.

గైడ్ టీచర్ : సీహెచ్.గీతాదేవి

వాడిన పరికరాలు : సిరంజీలు, కనెక్షన్ వైర్లు తదితర వస్తువులు.

ఉపయోగం : పాస్కల్ సూత్రం ప్రకారం ఆలివ్ ఆయిల్ వంటి నూనెల ప్రాసెసింగ్‌లో ఉపయోగపడుతుంది.

పేషెంట్ లిఫ్ట్

✍ హసన్



పాఠశాల : సెయింట్ జార్జ్ స్కూల్, కరీంనగర్, **తరగతి :** 9వ., **గైడ్ టీచర్ :** నరేశ్

వాడిన పరికరాలు : స్టీల్ పైపులు, కాస్టల్ వీల్స్, స్క్రూజాక్, లివర్, వైరు తదితర వస్తువులు.

ఉపయోగం : ఆస్పత్రుల్లో బెడ్ షీట్స్‌కు నైలాన్ బెల్టులను కట్టి, పేషెంట్‌లను సులువుగా షిఫ్ట్ చేయవచ్చు. ఇంట్లో ఉన్న వృద్ధులను కూడా షిఫ్ట్ చేయవచ్చు.

పలువురు టీచర్లు సైతం..



సెయింట్ జార్జ్ పాఠశాలకు చెందిన టీచర్ ప్రత్యూష గణితం, రుక్మాపూర్ సైనిక్ స్కూల్ టీచర్ గౌతమి కృష్ణకుమారి సైన్స్, ఇంగ్లిష్, కేజీబీవీ రామడుగు టీచర్ రజిత ఫిజిక్స్, కెమిస్ట్రీ విభాగాల్లో ప్రదర్శనలు రూపొందించి, ప్రదర్శించారు.

గోదావరి నది రక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న అతితేశ్వరానంద పర్వత స్వామీజీ

ధర్మపురి: గోదావరి నది రక్షణకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని శ్రీలంక అద్వైత పీఠాధిపతి అతితేశ్వరానంద పర్వత స్వామీజీ అన్నారు. ధర్మపురిలో గోదావరి మహా హారతి వ్యవస్థాపకుడు పోలుసాని మురళీధర్‌రావు ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం నిర్వహించిన ఉత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. 2012లో ప్రారంభించిన మహహారతి కార్యక్రమం కరోనా సమయంలో తప్ప ప్రతీ సంవత్సరం కార్తీక మాసంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనిషి జీవించి ఉన్నంత కాలం హిందువునని చెప్పుకుంటే ఎంతో గర్వంగా ఉంటుందన్నారు. పవిత్ర గోదావరిని కలుషితం చేయొద్దని సూచించారు. చిన్నారుల కూచిపూడి, భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం గోదావరిలోని మంగలి గడ్డ పుష్కరఘాట్ వద్ద ప్రత్యేక పూజలు జరిపి, హారతి ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోదావరి హారతి రాష్ట్ర కన్వీనర్ లింగంపెల్లి వీరగోపాల్, కో–కన్వీనర్ దామెర సుధాకర్ రావు, జిల్లా కో–కన్వీనర్ పిల్లి శ్రీనివాస్, నాయకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

పాపను బలితీసుకున్న బొలెరో

- డ్రైవర్ వాహనాన్ని అజాగ్రత్తగా వెనక్కి తీయడంతో ఘటన



రఫిదా (ఫైల్)

సుల్తానాబాద్‌రూరల్: బొలెరో వాహనం తల పైనుంచి వెళ్లడంతో ఓ పాప మృతిచెందింది. సుల్తానాబాద్ రెండో ఎస్సై వేణుగోపాల్ వివరాల ప్రకారం.. సుల్తానాబాద్ మండలంలోని కదంబపూర్(తుర్కకాశిపల్లి)కు షేక్ రాజ్ మహమ్మద్–ఫరిదా దంపతులకు నాలుగేళ్ల కొడుకు, ఏడాది పాప రఫిదా ఉన్నారు. రాజ్ మహమ్మద్ జీవనోపాధి నిమిత్తం గల్ఫ్ వెళ్లాడు. శనివారం ఉదయం ఫరిదా ఇంటి పనిలో నిమగ్నమైంది. పాప ఇంటి పక్కనే ఉన్న ఇసుక కుప్పలో ఆడుకుంటోంది. ఆ సమయంలో సయ్యద్ షకీల్ తన బొలెరో వాహనాన్ని అజాగ్రత్తగా వెనక్కి తీయడంతో రఫిదా తల పై నుంచి వెళ్లింది. తీవ్రంగా గాయపడిన పాపను కుటుంబసభ్యులు సుల్తానాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తల్లి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

పురుగుల అన్నం.. తాగునీరు కలుషితం

- గురుకులాలపై నమ్మకం లేదు
- మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్
- ముత్తారంలోని కేజీబీవీ తనిఖీ



కేజీబీవీలో భోజనం పరిశీలిస్తున్న పుట్ట మధూకర్

ముత్తారం(మంథని): కేజీబీవీలో పురుగుల అన్నం, కలుషితమైన తాగునీరు ఉందని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలోని గురుకులాలు, మోడల్ స్కూళ్లు, కేజీబీవీల్లో వసతులపై నమ్మక లేదన్నారు. బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు శనివారం ముత్తారంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని సందర్శించినట్లు తెలిపారు. తొలుత కేజీబీవీలోకి అనుమతి లేదని సిబ్బంది నిరాకరించారు. ఆ తర్వాత లోపలికి వెళ్లిన మధూకర్.. వంట సామగ్రి, భోజనం పరిశీలించారు. తాగునీరు సరఫరా చేసే ట్యాంకు అపరిశుభ్రంగా ఉందన్నారు. వంటగదిలో కొన్నిసౌకర్యాలు బాగానే ఉన్నాయన్నారు. హెల్త్‌రూమ్‌లోని ఆరోతరగతి బాలిక వద్దకు వెళ్లి అనారోగ్యానికి గల కారాణాలపై ఆరా తీశారు. అనారోగ్యం గురించి తల్లిదండ్రులకు సమాచారం ఎందుకు ఇవ్వలేదని ఏఎన్ఎం, ఇన్‌చార్జి ఉపాధ్యాయురాలిని ప్రశ్నించారు. నిన్నరాత్రే బాలిక వచ్చిందని, ప్రయాణంలో అలసటకు గురవడంతో సిక్ అయ్యిందని వారు బదులిచ్చారు. తమ బీఆర్ఎస్ ప్రభుత్వం గురుకులాల్లో అన్ని వసతులు కల్పిస్తే.. రేవంత్ సర్కార్ సౌకర్యాలు కల్పించడంలో విఫలమైందని విమర్శించారు. తమ హయాంలో స్థానిక కేజీబీవీలో సీటు కోసం రికమండ్ చేసేవారని, బాలికలకు అస్వస్థత కావడంతో ఇక్కడకు రావాలంటే జంకుతారని అన్నారు. మోడల్ స్కూల్‌లో వంటగదులు లేక ఇబ్బందిపడుతున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పోతిపెద్ది కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు జక్కుల ముత్తయ్యపటేల్, అత్తె చంద్రమౌళి, నాయకులు నూనె కుమార్, గుజ్జుల రాజిరెడ్డి, ఇల్లాందుల అశోక్, పోతిపెద్ది రమణారెడ్డి, చల్ల సమ్మయ్య, భూపెల్లి మొగిలి, సుదాటి రవీందర్‌రావు, శేరు స్వామి తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న హాకీ పోటీలు



క్యాంప్ ఫైర్‌ను ప్రారంభిస్తున్న శ్రీనివాస్, అధికారులు

హుజూరాబాద్: హుజూరాబాద్ పట్టణంలోని హైస్కూల్ క్రీడా మైదానంలో రాష్ట్రస్థాయి 68వ ఎస్‌జీఎఫ్ హాకీ పోటీలు కొనసాగుతున్నాయి. ఖమ్మం, నల్గొండ, హైదరాబాద్, వరంగల్, మహబూబ్‌నగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ ఉమ్మడి జిల్లాలకు చెందిన క్రీడాకారులు పోటీల్లో పాల్గొంటున్నారు. శనివారం నాటి పోటీలను తహసీల్దార్ కనుకయ్య, ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ ప్రారంభించారు. డీఈవో జనార్దన్‌రావు, ఎంఈవో శ్రీనివాస్ పర్యవేక్షిస్తున్నారు. ఉమ్మడి పది జిల్లాల పరిధిలోని 20 జట్లు పోటీ పడ్డాయి. శనివారం సాయంత్రం లీగ్ మ్యాచ్‌లు ముగిశాయి. అండర్–14 బాలికల విభాగంలో కరీంనగర్, నిజామాబాద్, రంగారెడ్డి, నల్గొండ జట్లు సెమీస్‌కు వెళ్లాయి. బాలుర విభాగంలో హైదరాబాద్, నిజామాబాద్, ఆదిలాబాద్, రంగారెడ్డి జట్లు సెమీస్‌కు చేరుకోగా.. నేడు ఆయా జట్లు తలపడున్నాయి. గెలిచిన జట్లు ఫైనల్‌కు వెళ్తాయి. కాగా.. రాత్రి ఏర్పాటుచేసిన క్యాంప్ ఫైర్ ఆకట్టుకుంది. క్రీడాకారులు ఉల్లాసంగా పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

WANTED

■ హరేకృష్ణ హోంకేర్‌లో వృద్ధులను పేషెంట్లను చూసుకొనుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి ఫుడ్ జీ: 18K. Ph: 9640258899, 9640468899 [SCA24000705]

■ షిరిడి సాయి వృద్ధుల ఆశ్రమము హైదరాబాద్‌లో లేడీ సూపర్ వైజర్స్, నర్సులు, కాంపౌండర్స్, ఆయాలు, భార్యాభర్తలు కావలెను. 9391036931, 9246585901 [HA-14774]

■ పనివారు కావలెను HYD, బెంగుళూరులో ఉండి ఇంటి, వంటపని, వృద్ధుల సేవ, పిల్లలపోషణకి స్త్రీలు కావలెను. ఫోన్ 9391912949/ 04040123376 [SCA24000716]

www.sakshi.com

■ ప్రముఖ కంపెనీలో వర్క్ చేయుటకు స్త్రీ, పురుషులు కావలెను. Qul: 10th - డిగ్రీ, Sal: 20K - 30 K మీ అడ్రస్ వాట్సప్ చేయగలరు. వర్క్ ఫ్రం హోం అవకాశం కలదు. 8121818692 [M-1253937]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.


For Classifieds, Advertisements Contact:
9951602933, 9951602824

అవగాహనే ఔషధం

- జిల్లాలో తగ్గుతున్న ఎయిడ్స్ వ్యాధిగ్రస్తులు
- గతేడాది వ్యాధి వ్యాప్తి రేటు 0.48
- ఈ ఏడాది 0.29గా నమోదు
- నేడు ఎయిడ్స్ నివారణ దినోత్సవం

జిల్లాలో హెచ్ఐవీ/ఎయిడ్స్ సమాచారం

జనాభా	7,95,332
ఈ ఏడాది వ్యాధివ్యాప్తి రేటు	0.29
గతేడాది నమోదైన రేటు	0.48
హెచ్ఐవీ పాజిటివ్‌లు	2,214
ఏఆర్‌టీ కేంద్రం	జీజీహెచ్
లింక్ ఏఆర్‌టీ కేంద్రం	పెద్దపల్లి ఆస్పత్రి
ఏఆర్‌టీ మందులు వాడేవారు	1,774
పింఛన్లు పొందుతున్నవారు	1,774



కోల్‌సిటీ(రామగుండం): జిల్లావాసుల్లో ఎయిడ్స్‌పై అవగాహన పెరుగుతోంది. తద్వారా ఈ వ్యాధి వ్యాప్తిరేటు క్రమంగా తగ్గుముఖం పడుతోంది. గతేడాది వ్యాధి వ్యాప్తిరేటు 0.48 ఉండగా.. ఈ ఏడాది 0.29గా నమోదు కావడం ఇందుకు అద్దంపడుతోంది. అయితే, పీడితులపై వివక్ష చూపించ వద్దని, వారిహక్కులను పరిరక్షించాలని అధికారులు సూచిస్తున్నారు. ఈ దిశగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ విస్తృతంగా అవగాహన కల్పిస్తోంది. ఆదివారం ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా కథనం.

అందుబాటులో ఏఆర్‌టీ సేవలు..

హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితుల్లో వైరస్ తగ్గించడానికి యాంటీ రిట్రో వైరల్ థెరపీ(ఏఆర్‌టీ) కేంద్రాలు ఉమ్మడి జిల్లాలోని ప్రధాన ప్రభుత్వ ఆస్పత్రులు సేవలు అందిస్తున్నాయి. మరో ఆరు లింక్ ఏఆర్‌టీ కేంద్రాలూ ఉన్నాయి. ఉమ్మడి జిల్లాల్లోని 15 ఐసీటీసీల్లో ఉచితంగా హెచ్ఐవీ నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారు. సురక్షా క్లినిక్‌లలో సుఖవ్యాధులకు ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నారు. జిల్లాలో 1,774 మంది ఏఆర్‌టీ మందులు వినియోగిస్తున్నారు. ఇందులో 603 మంది రామగుండం మండలానికి చెందిన వారే ఉన్నారు. ఉమ్మడి జిల్లాలో సెక్స్‌వర్కర్లు, ఎంఎస్ఎంలు సుమారు 7వేల మందికిపైగా ఉన్నారని అంచనా. అయితే, సీడీ4 (రోగ నిరోధక శక్తిని కాపాడే తెల్ల రక్త కణాలు) కౌంటింగ్‌తో సంబంధం లేకుండా ఏఆర్‌టీ మందులను ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో వేలాది మంది హెచ్ఐవీ పేషెంట్లకు ఈ మందులు కొత్త 'ఆశ'ను కల్పిస్తున్నాయి.

అధికారులకు సవాల్..

హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధిగ్రస్తుల్లో కొందరు మధ్యలోనే మందులు ఆపేస్తున్నారు. ఇలాంటి వారిని గుర్తించడం వైద్యాధికారులకు సవాల్‌గా మారింది. వ్యాధిగ్రస్తులు స్వచ్ఛందంగా మందులు వాడకపోవడంతో, వారి ద్వారా మరికొందరికి వ్యాధి సోకుతుంది. ఇలాంటి వారిని అష్టకష్టాలుపడి గుర్తించి, వారితో తిరిగి మందులు వాడేలా అవగాహన కల్పిస్తున్నారు.

హక్కులను పరిరక్షిద్దాం..

హెచ్ఐవీ, ఎయిడ్స్ బాధితులకు ఇల్లు అద్దెకు ఇవ్వకపోయినా, పనిప్రదేశాలు, చికిత్స పొందే ఆస్పత్రుల్లో వివక్ష చూపించినా చట్టప్రకారం శిక్ష విధిస్తారని అధికారులు వివరిస్తున్నారు. న్యాయం కోసం బాధితులు జిల్లా న్యాయ సేవా అథారిటీని సంప్రదించే వీలుందని అంటున్నారు. ఇలాంటి వారికి న్యాయ సాయం చేయడానికిఓ అనేక స్వచ్ఛంద సంస్థలు ఇప్పటికే కృషి చేస్తున్నాయి. మానసిక ధైర్యం కల్పించి, హక్కులను పరిక్షించడం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. ఇలాంటి వారు ఎవరికీ చెప్పుకోలేక, ఒంటరిగా ఉండడంతో వారి నుంచి మరికొందరికి వ్యాధి వ్యాపించే అవకాశం ఉందని డాక్టర్లు అంటున్నారు. అందుకే వీరితోపాటు ప్రజల్లోనూ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు.

కేసులు తగ్గాయి



హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై ఉమ్మడి జిల్లా వాసుల్లో అవగాహన పెరుగుతోంది. అందుకే గతం కంటే ఇప్పుడు చాలా కేసులు తగ్గాయి. ప్రతిఒక్కరూ హెచ్ఐవీ, ఎయిడ్స్ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలి.

– సురేందర్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్

హక్కులకు భంగం కలిగించొద్దు



హెచ్ఐవీ బాధితుల హక్కులకు భంగం కలుగకుండా ప్రతిఒక్కరూ చూడాలి. హెచ్ఐవీ, ఎయిడ్స్ వ్యాధి సోకిందని భయపడొద్దు. ఏఆర్‌టీ మందులు క్రమం తప్పకుండా వాడితే వైరస్ వ్యాప్తి మందగిస్తుంది.

– అన్నప్రసన్నకుమారి, డీఎంహెచ్‌వో